క్లుప్తంగా

ఆలయ నిర్మాణానికి రూ. 4.50లక్షల విరాళం



పెనుగంచిప్రోలు(వత్సవాయి): ఎన్టీఆర్ జిల్లా పెనుగంచిప్రోలు గ్రామంలో వేంచేసియున్న శ్రీ స్వయంభు శంభులింగేశ్వరస్వామి నూతన ఆలయ నిర్మాణానికి సోమవారం దాతలు విరాళాన్ని అందజేశారు. హైదరాబాద్‌కు చెందిన అరికపూడి శివకుమార్, శాంతిల కుమారుడు దుర్గాసాయి రామనాథ్‌చౌదరి రూ. 4,50,000 విరాళాన్ని ట్రస్టు చైర్మన్ వాసిరెడ్డి బెనర్జీకి అందించారు. ఈ సందర్భంగా దాతలను శాలువాతో సత్కరించి స్వామివారి ప్రసాదాలను అందజేశారు.

సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన



నందిగామ టౌన్: ఇటీవల కాలంలో సైబర్ నేరాలు అధికమవుతున్నాయని ముఖ్యంగా మహిళలు, వృద్ధులనే లక్ష్యంగా చేసుకుని సైబర్ నేరగాళ్లు రెచ్చిపోతున్నారని ఎస్‌ఐ అభిమన్యు పేర్కొన్నారు. పట్టణంలోని దీక్షా జూనియర్ కళాశాలలో సోమవారం సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సైబర్ నేరాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. హానికరమైన సైబర్ నేరాలు జాతీయ, ఆర్థిక భద్రతకు ముప్పు కలిగిస్తాయని తెలిపారు. బ్యాంకులు, క్రెడిట్ కార్డులతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాల పేరుతో కూడా సైబర్ నేరగాళ్లు ప్రజలను ఏమార్చి డబ్బులు కాజేస్తున్నారని చెప్పారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండటంతో పాటు తెలియని వ్యక్తులతో బ్యాంకులు తదితర విషయాలను చర్చించవద్దని ఆయన సూచించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వెయిట్ లిఫ్టింగ్‌లో సత్తాచాటిన మిక్ విద్యార్థి



కంచికచర్ల: ఈ నెల 13, 14 తేదీల్లో ప్రకాశం జిల్లా చీరాల సెయింట్ ఆన్స్ ఇంజినీరింగ్ కళాశాలలో జేఎన్‌టీయూ కాకినాడ పరిధిలో నిర్వహించిన వెయిట్ లిఫ్టింగ్ ఆటల పోటీల్లో తమ కళాశాల విద్యార్థి వి. భరత్‌బాలాజీ పాల్గొని మంచి ప్రతిభ కనపర్చి బంగారు పథకాన్ని సాధించాడని మిక్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి. వంశీకిరణ్ పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం కళాశాలలో విద్యార్థి భరత్‌బాలాజీని ప్రిన్సిపాల్ డాక్టర్ టి. వంశీకిరణ్‌తోపాటు సీఈఓ డి. పాండురంగారావు, పీడీ నిమ్మగడ్డ శౌరయ్య తదితరులు అభినందించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థి భరత్‌బాలాజీ త్వరలో కాకినాడ జేఎన్‌టీయూలో నిర్వహించనున్న వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు ఎంపికయ్యాడని తెలిపారు. తమ కళాశాలలో విద్యార్థులకు సాంకేతిక విద్యనందించడంతో పాటు పలు క్రీడా విభాగాల్లో మంచి తర్ఫీదు అందిస్తున్నామని పేర్కొన్నారు.

ఇరు వర్గాలపై కేసు నమోదు

కంచికచర్ల: మండలంలోని పెండ్యాలలో ఓ శుభకార్యం వద్ద ఇరు వర్గాల మధ్య ఘర్షణ జరగడంతో సోమవారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ బి. రాజు తెలిపారు. ఎస్‌ఐ కథనం మేరకు.. మండలంలోని పెండ్యాల గ్రామంలో ఎంపీపీ షేక్ మలక్‌బషీర్ ఓ శుభకార్యానికి వెళ్లగా అదే సమయంలో టీడీపీ కార్యకర్తలు కూడా ఆ శుభకార్యానికి వచ్చారు. వారి మధ్య జరిగిన సంఘటనతో ఎంపీపీపై టీడీపీ కార్యకర్తలు దౌర్జన్యం చేశారు. దీంతో ఇరు వర్గాల్లోని 30మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

వేపలవాగు ముంపునకు
శాశ్వత పరిష్కారం లేదా..?

- వర్షాకాలం వస్తే చాలు వాగు పొంగి ఇళ్లలోకి వస్తున్న వరద నీరు
- ఆక్రమణలతో కుంచించుకుపోవడంతోనే ముంపు అంటున్న నిపుణులు



పేటలో జనావాసాల మధ్య ప్రవహిస్తున్న వేపలవాగు (ఫైల్)

జగ్గయ్యపేట అర్బన్: వర్షాకాలం సీజను వచ్చిందంటే జగ్గయ్యపేట పట్టణంలోని వేపలవాగు సమీపంలో నివశిస్తున్న పలు వార్డుల ప్రజలు తట్టాబుట్ట సర్దుకొని సిద్ధంగా ఉండాల్సిందే. భారీ వర్షాలకు వేపలవాగు పొంగి వాగుకు ఇరువైపుల ఉన్న ఇళ్లల్లోకి వరద నీరు రావడం జరుగుతోంది. మూటాముల్లె సర్దుకుని మెరక ప్రాంతాలకు గానీ, పునరావాస కేంద్రాలకు గానీ వెళ్లడం, వరద ఉధృతి తగ్గిన తర్వాత మరలా తమ ఇళ్లకు రావడం పరిపాటి అయ్యింది. ఈ సమస్యకు పరిష్కారం లేదా అని ప్రతి యేటా వేపలవాగుకు ఇరువైపుల నివశించే ప్రజలు ప్రజాప్రతినిధులను, అధికారులను నిలదీయడ, వారు పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని వాగ్దానాలు చేయడం కూడా పరిపాటిగా మారింది.



ఇటీవల ఇళ్లలోకి వచ్చిన వరద నీరు (ఫైల్)

వేపలవాగు నేపథ్యం

పట్టణంలోని ఊరచెరువుకు ప్రధాన నీటి సరఫరా చానల్స్‌గా ఎర్రకాలువ, వేపలవాగు ఉన్నాయి. ఈ రెండింటిలో ఒకటైన వేపలవాగు జగ్గయ్యపేట మేజర్ కాలువ గుండా మండలంలోని పలు గ్రామాల పంట పొలాలకు నీటిని అందించే కాలువ ద్వారా వచ్చే నీటితో ప్రవహిస్తూ తిరుమల గ్రామం శివారులో 65వ జాతీయ రహదారిని దాటుతుంది. తిరుమలగిరి గ్రామం ఆర్చి వద్ద హైవే వద్ద ఉన్న బ్రిడ్జి గుండా ప్రవహిస్తూ జగ్గయ్యపేట ప్రాంతంలోకి ప్రవేశిస్తుంది. గతంలో ఈ వాగు గట్లపై ఎక్కువగా వేపచెట్లు ఉండటంతో వేపలవాగు అనే పేరు వచ్చింది. ఈ వాగు రెండవ వార్డు యానాదుల కాలనీ, ఆరవ వార్డు బిలాల్ మసీదు సెంటర్, ఏడవ వార్డు ఆర్టీసీ కాలనీ, ఐదవ వార్డు చింతలతోపు, వైవై కాలనీ, చివరగా తొమ్మిదవ వార్డు మీదుగా సుమారు 2.5 కి.మీ దూరం ప్రవహించి ఊరచెరువులో కలుస్తుంది.



తిరుమలగిరి పొలాల నుంచి వస్తున్న కాలువ

ఆక్రమణలతోనే వరద ముంపు

వేపలవాగు వెడల్పు 120 అడుగులు ఉండగా, కొన్ని చోట్ల ఆక్రమణలకు గురై 30 నుంచి 40 అడుగులకు కుంచించుకుపోయింది. ఈ వాగు మొదలయ్యే దగ్గర నుంచి ఆర్టీసీ కాలనీ వరకు రియల్ ఎస్టేట్ అనధికార లే అవుట్ల వల్ల ఆక్రమణలకు గురైంది. దీంతో ఎగువ ప్రాంతం నుంచి వచ్చే వరద ఉధృతికి అది ప్రవహించే దారి ఇరుకుగా ఉంటోంది. దీంతో ఇళ్ల మీదకు వరద నీరు వచ్చి ముంపు ఏర్పడుతుంది. ఫలితంగా ఆస్తి, ప్రాణనష్టం జరుగుతూ వస్తోంది. మున్సిపల్, ఇరిగేషన్ అధికారులు స్పందించి ఆక్రమణలను తొలగించాలని వేపలవాగు పరీవాహక ప్రాంత వాసులు కోరుతున్నారు.

గోడ నిర్మించడమే శాశ్వత పరిష్కారం

వేపలవాగు పట్టణంలోకి ప్రవేశించే ప్రాంతం నుంచి చెరువు వరకు సుమారు 2.5 కి.మీ రివిట్‌మెంట్ కాంక్రీటు గోడ రెండు వైపుల సుమారు 10 అడుగుల ఎత్తున నిర్మించడమే ఈ సమస్యకు శాశ్వత పరిష్కారమని ముంపు బాధితులు చెబుతున్నారు. తద్వారా ఆస్తి, ప్రాణ నష్టాలు జరగకుండా కాపాడవచ్చునని పేర్కొంటున్నారు. దీనికి ప్రజా ప్రతినిధులు, మున్సిపల్, ఇరిగేషన్ అధికారులు స్పందించి ముందుకు రావాలని కోరుతున్నారు.

తీవ్రంగా నష్టపోయాం



ఇటీవల వచ్చిన భారీ వర్షాలకు మా ఇంటిలోకి నాలుగు అడుగుల మేర వరద నీరు వచ్చింది. సామాన్లు అన్నీ తడిసిపోయాయి. కొన్ని సామాన్లు కొట్టుకుపోయి తీవ్రంగా నష్టపోయాం. ప్రభుత్వం మా సమస్యను గుర్తించి మరోసారి వరద ముంపునకు గురికాకుండా చర్యలు తీసుకోవాలి.

–షేక్ రజా, జగ్గయ్యపేట

శాశ్వత పరిష్కారం చూపాలి



ఇటీవల వచ్చిన వరద సమయంలో వేపలవాగు పొంగి సుమారు 200 మీటర్ల మేర ఇళ్లలోకి చొచ్చుకువచ్చింది. దీంతో వేపలవాగుకు ఇరువైపుల నివశించే సుమారు రెండు వేల కుటుంబాలు ముంపునకు గురయినారు. ప్రజాప్రతినిధులు, మున్సిపాలిటీ అధికారులు ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపి మమ్మల్ని రక్షించాలి.

–దివ్వెల కృష్ణ, సుతారు మేస్త్రి, జగ్గయ్యపేట

ఆక్రమణలు తొలగించాలి



వేపలవాగు వరద నీరు ఇళ్లపై పడి తీవ్రంగా ఆస్తి నష్టం జరగడానికి కారణం వేపలవాగు స్థలం ఆక్రమణకు గురికావడమే. కావున సంబంధిత అధికారులు ఆక్రమణలు తొలగించాలి. అలాగే వాగుకు ఇరువైపుల గోడ నిర్మించాలి. దీనికి సుమారు రూ. 40 కోట్ల వ్యయం అవుతుందని గతంలో ఇరిగేషన్ అధికారులు తెలిపారు.

–వట్టెం మనోహర్, 5వ వార్డు మున్సిపల్ కౌన్సిలర్, జగ్గయ్యపేట

న్యాయవాదులకు ఇళ్లస్థలాలు కేటాయించాలి



నందిగామ టౌన్: అర్హులైన న్యాయవాదులకు ఇళ్లస్థలాలు కేటాయించాలని న్యాయవాదులు నంద్రు శ్రీరామ్మూర్తి, ఎక్కిరాల హనుమంతరావు కోరారు. ఈ మేరకు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఎమ్మార్వో సురేష్‌బాబుకు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా న్యాయవాద వృత్తిలో ఉన్నప్పటికీ కనీసం సొంతిల్లు కూడా లేదన్నారు. అంతేకాకుండా న్యాయవాద వృత్తిలో ఎక్కువ మంది పేద, బడుగు, బలహీన వర్గాలకు చెందిన వారే ఉన్నారని తెలిపారు. సమస్యను సంబంధిత ఉన్నతాధికారులు, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి అర్హత కలిగిన న్యాయవాదులకు ఇంటి స్థలం, ఇళ్లు మంజూరు చేయాలని కోరారు. అనంతరం తహసీల్దార్ సురేష్‌బాబును సత్కరించారు. కార్యక్రమంలో విద్యా కమిటీ చైర్మన్ మల్లెపాక శ్రీనివాసరావు, న్యాయవాదులు నూతక్కి తారాసింగ్, వేల్పుల స్వామి, మాదుగుల స్టాలిన్, ప్రభాకర్, ప్రేమ్‌చంద్, ముక్తేశ్వరరావు, విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అర్జీలు నిల్

కంచికచర్ల: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో గ్రామాల్లో సమస్యలు పరిష్కరించాలని ఒక్క అర్జీ కూడా రాలేదని తహసీల్దార్ పి. జాహ్నవి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామాల్లో ఏమైనా సమస్యలు ఉంటే అర్జీ ద్వారా తమకు తెలియజేయాలని రైతుల భూముల్లో కొలతలు, హద్దుల్లో తేడాలు ఉన్నట్లయితే తహసీల్దార్ కార్యాలయంలో అర్జీ చేసుకోవాలని సూచించారు.

పేటలో పత్తి కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలి

వైఎస్సార్ సీపీ సమన్వయకర్త తన్నీరు నాగేశ్వరరావు



మాట్లాడుతున్న తన్నీరు నాగేశ్వరరావు తదితరులు

జగ్గయ్యపేట అర్బన్: నియోజకవర్గ కేంద్రమైన జగ్గయ్యపేటలో పత్తి కొనుగోలు కేంద్రాన్ని వెంటనే ఏర్పాటుచేయాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త, కేడీసీసీ బ్యాంక్ మాజీ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. స్థానిక కోదాడ రోడ్‌లో నూతనంగా ఏర్పాటుచేసిన వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కార్యాలయంలో సోమవారం ఆయన పార్టీ నేతలతో కలిసి విలేకరులతో మాట్లాడారు. నియోజకవర్గ పరిధిలో సుమారు 20 వేల ఎకరాల్లో పత్తి సాగు చేశారని, గత రెండు నెలల క్రితం వరదలు వచ్చి చాలా పత్తి రాలిపోయిందన్నారు. దీంతో ఉన్న పత్తిని అమ్ముకుందామంటే జగ్గయ్యపేట వ్యవసాయ మార్కెట్ యార్డులో ఇప్పటి వరకు పత్తి కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ఇప్పటికే సీసీఐ కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటుచేయాల్సి ఉన్నా నేటికీ జగ్గయ్యపేటలో గానీ, నందిగామ, మైలవరంలో గానీ ప్రారంభించలేదన్నారు. జగ్గయ్యపేట మార్కెట్ యార్డులో కొనుగోలు కేంద్రం ఏర్పాటుచేసి ఉంటే రైతులు పత్తిని అమ్ముకొని ఉండేవారు అన్నారు.

దళారీల దోపిడీకి గురవుతున్న రైతులు

పత్తి కొనుగోలు కేంద్రం లేకపోవడంతో రైతులు దళారీల దోపిడీకి గురవుతున్నారని తన్నీరు నాగేశ్వరరావు అన్నారు. ఎకరానికి 15 క్వింటాళ్లు పండాల్సిన పత్తి ఈ రోజున 7, 8 క్వింటాళ్లు కూడా రావడంలేదని, ఇలాంటి పరిస్థితుల్లో పండిన పంటకు గిట్టుబాటు ధర రాకపోతే రైతులు ఏమైపోవాలని ప్రశ్నించారు. తేమ శాతం 17, 18 ఉన్నప్పటికీ మద్దతు ధరకు కొనుగోలు చేయాలని అన్నారు. గుంటూరు వెళ్లే ప్రాతిపదిక కాకుండా జగ్గయ్యపేటలోనే పత్తి అమ్ముకునే అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రైతుల పక్షాన పెద్ద ఎత్తున ప్రజా పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ హాఫీజున్నీసా ఫిరోజ్, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు చల్లా దుర్గా వైకుంఠరావు, నాయకులు గోగుల వెంకయ్య, ఉపేందర్‌రెడ్డి, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

బెల్టు షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు

ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ రాహుల్‌దేవ్ శర్మ

సాక్షి ఎఫెక్ట్

కంచికచర్ల: గ్రామాల్లో బెల్టుషాపులు నిర్వహించి అక్రమంగా మద్యాన్ని విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ రాహుల్‌దేవ్ శర్మ పేర్కొన్నారు. ఈనెల 17 'మద్యం ప్రియుల జేబులకు చిల్లు' అనే కథనాన్ని సాక్షి ప్రచురించింది. స్పందించిన ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ సోమవారం కంచికచర్ల ఎక్సైజ్‌శాఖ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ.. బెల్టుషాపులు నిర్వహిస్తూ ఎక్కువసార్లు పట్టుబడితే బైండోవర్ చేస్తామని హెచ్చరించారు. తెలంగాణా రాష్ట్రం నుంచి మద్యం ఈ ప్రాంతానికి వస్తోందని ఇప్పటికే తమ శాఖ, ఎక్సైజ్‌శాఖ అధికారులు అటువంటి మద్యాన్ని తరలిస్తున్న లేదా విక్రయిస్తున్న వారిని పట్టుకుని కేసులు నమోదు చేయడం జరుగుతోందన్నారు. లైసెన్స్ మద్యం దుకాణాలు నడిపే నిర్వాహకులు ఎంఆర్పీ కంటే ఎక్కువ ధరకు విక్రయిస్తే కేసు నమోదు చేయడం జరిగిందని తెలిపారు. సమావేశంలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్‌శాఖ జిల్లా అధికారి శ్రీనివాసరావు, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ రామశివ, సీఐ అఫ్రపున్నీసా బేగం, ఎస్‌ఐ గాలిసైదా, సిబ్బంది పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఈడీ రాహుల్‌దేవ్ శర్మ

కిటకిటలాడిన శివాలయాలు



దాములూరు కూడలి సంగమేశ్వరస్వామి



మంగొల్లు శివాలయంలో స్వామివారు



అడవిరావులపాడు చెన్నమల్లికార్జునస్వామి ఆలయంలో శివలింగాకారంలో వెలిగించిన దీపాలు

ఆదిదేవునికి హోమాలు, అభిషేకాలు

నందిగామ టౌన్: కార్తికమాసం మూడవ సోమవారం సందర్భంగా పట్టణం, ఆయా గ్రామాల్లోని శివాలయాలకు భక్తులు పోటెత్తారు. శివాలయాల్లో స్వామివారికి మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, బిళ్వ, పుష్పార్చన తదితర అభిషేకాలు, హోమాలను అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. పట్టణంలోని రామలింగేశ్వర స్వామి, చెన్నకేశవ స్వామివారి ఆలయాలతో పాటు మండలంలోని దాములూరు కూడలి సంగమేశ్వర స్వామి, గోళ్లమూడి శంభులింగేశ్వరస్వామి, పల్లగిరి, రాఘవాపురం గ్రామాల్లో ఆలయాలకు తెల్లవారుజాము నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. భక్తిశ్రద్ధలతో కార్తిక దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయాల్లో భక్తులకు ఇబ్బందులు లేకుండా ఆలయ అధికారులు, కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. మండలంలోని అడవిరావులపాడు గ్రామంలో వేంచేసియున్న భ్రమరాంబ సహిత చెన్నమల్లికార్జునస్వామి ఆలయంలో అర్చకులు స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి విశేష హోమాలు, లక్ష మారేడు దళార్చన పూజలు చేశారు.

చందర్లపాడులో..

చందర్లపాడు మండలంలోని ఆయా గ్రామాల్లోని ఆలయాల్లో కార్తిక సోమవారం సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు పుణ్య స్నానాలు ఆచరించి వేకువజామునే కార్తిక దీపాలు వెలిగించారు.

వత్సవాయి: మండలంలోని శివాలయాలు సోమవారం భక్తులతో కిటకిటలాడాయి. కార్తిక మాసం మూడవ సోమవారం కావడంతో భక్తులు పెద్దసంఖ్యలో స్వామివార్లను దర్శించుకుని పూజలు చేశారు. లింగాల వద్ద మునేటిలో స్నానాలు చేసి పక్కనే ఉన్న శ్రీ రామలింగేశ్వరుని దర్శించుకున్నారు. అదేవిధంగా వత్సవాయి, పోలంపల్లి, కంభంపాడు, మక్కపేట, భీమవరం, మంగొల్లు, గోపినేనిపాలెం గ్రామాల్లోని శివాలయాల వద్ద భక్తులు పూజలు చేసి దీపాలు వెలిగించారు.



కంచికచర్లలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు

కంచికచర్ల: కార్తిక మాస మూడవ సోమవారం సందర్భంగా స్థానిక పాత శివాలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అలాగే స్థానిక మహాలక్ష్మి అమ్మవారి ఆలయం, వాసవీకన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో అమ్మవార్లకు భక్తులు విశేష పూజలు నిర్వహించారు. మండలంలోని పరిటాల, గండేపల్లి, చెవిటికల్లు, మోగులూరు, గనిఆత్కూరు తదితర గ్రామాల్లోని ఆలయాల్లో భక్తులు స్వామివార్లకు పూజలు చేసి దీపాలు వెలిగించారు.

వలంటీర్లకు ఇచ్చిన హామీని నెరవేర్చాలి

నందిగామ టౌన్: ఎన్నికల సమయంలో వలంటీర్లకు ఇచ్చిన హామీని కూటమి ప్రభుత్వం నెరవేర్చాలని ఏఐవైఎఫ్ నియోజకవర్గ కార్యదర్శి హనుమంతరావు డిమాండ్ చేశారు. రాష్ట్ర వలంటీర్స్ అసోసియేషన్ పిలుపు మేరకు వలంటీర్లను విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ సోమవారం తహసీల్దార్ సురేష్‌బాబుకు వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో వలంటీర్లకు రూ. 10వేల వేతనం అందిస్తామని కూటమి నేతలు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని అన్నారు. అలాగే రాజీనామా చేసిన వలంటీర్లను కూడా విధుల్లోకి తీసుకోవాలని కోరారు. పలువురు వలంటీర్లు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకుంటే సమ్మె తప్పదు

నందిగామ టౌన్: ఈ నెల 25వ తేదీలోగా 108 అంబులెన్స్ ఎంప్లాయిస్ సమస్యలు పరిష్కరించకుంటే 26 నుంచి సమ్మె తప్పదని యూనియన్ జిల్లా అధ్యక్షుడు జిల్లేపల్లి యుగంధర్ పేర్కొన్నారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో సంఘ నాయకులతో కలిసి సోమవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ 108 అంబులెన్స్ ఎంప్లాయిస్ సమస్యలు పరిష్కరించాలని శాంతియుతంగా విన్నవిస్తే యాజమాన్యం, ప్రభుత్వం కనీసం స్పందించడం లేదని తెలిపారు. అధికారులకు, యాజమాన్య నిర్వాహకులకు సమ్మె నోటీస్ అందించి నిరసన తెలిపినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. 108 అంబులెన్స్ వ్యవస్థను ప్రభుత్వమే నిర్వహించాలని, ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించడంతో పాటు ఎనిమిది గంటల పని విధానం అమలు చేయాలని డిమాండ్ చేశారు. సంఘ నాయకులు రాఘవులు, నల్లగట్ల సమర్పణరావు,శ్రీనివాసరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న 108 యూనియన్ నాయకులు





కరుణించమ్మా.. కాపాడమ్మా

జగ్గయ్యపేటలోని విద్యానగర్‌లో రైల్వేకట్ట అవతల ఉన్న స్వయంభూ శ్రీనాగలక్ష్మి అమ్మవారి ఆలయ 36వ వార్షికోత్సవ వేడుకలను పురస్కరించుకొని సోమవారం రాత్రి అమ్మవారి ఊరేగింపు వైభవంగా జరిగింది. ప్రత్యేకంగా అలంకరించిన రథంపై అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ఉంచి ప్రధాన వీధుల్లో ఊరేగించారు. ప్రత్యేక కళాబృందాలు అష్టలక్ష్మి, బేతాళ, కాళికా శక్తి దేవతామూర్తుల వేషధారణలతో చేసిన నృత్యాలు ప్రజలను అలరించాయి. –జగ్గయ్యపేట అర్బన్





తైక్వాండో పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



కంచికచర్ల: తైక్వాండ్ పోటీల్లో ఏకత్వ పాఠశాల విద్యార్థులు మంచి ప్రతిభ కనబర్చి బహుమతులతో పాటు ప్రశంసాపత్రాలను అందుకున్నారని పాఠశాల చైర్మన్ అమరనేని రమేష్‌బాబు అన్నారు. వీరులపాడు మండలం పొన్నవరం గ్రామ శివారులోని ఏకత్వ పాఠశాలలో బంగారు, కాంస్య, రజిత పథకాలు సాధించిన విద్యార్థులను సోమవారం అభినందించారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ ఇటీవల కృష్ణాజిల్లా తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో విజయవాడ పాపులర్ స్పోర్ట్స్ అకాడమీలో జిల్లాస్థాయి తైక్వాండో పోటీలు నిర్వహించడం జరిగిందన్నారు. ఈ పోటీల్లో తమ పాఠశాల విద్యార్థులు పాల్గొని మూడు బంగారు, తొమ్మిది రజిత, ఆరు కాంస్య పథకాలు సాధించారని తెలిపారు. అనంతరం తైక్వాండో శిక్షకుడు రత్నకాంత్‌ను అభినందించారు. కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్లు మనోజ్, కార్తీక్, సింధూర, శాంతి, పీడీ విజయకుమార్ పాల్గొన్నారు.